నిమజ్జన ప్రాంతాలు పరిశీలన

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలో వినాయక విగ్రహాల నిమజ్జన ప్రాంతాలను కడప డిఎస్‌పి వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు వినాయక నిమజ్జనం నిర్వహించే పాత కడప చెరువు, చెన్నూరు పి.ఎస్ పరిధిలోని ఇర్కాన్ సర్కిల్, శేషయ్య గారి పల్లి వద్ద ఉన్న కె.సి కెనాల్ బ్రిడ్జి, చెన్నూరు పెన్నా నది కొత్త బ్రిడ్జి, కొండపేట వంతెన వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా వినాయక విగ్రహాలను ఎత్తే భారీ క్రేన్లను, డ్రైవర్లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో ఎలాంటి ఘటనలకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ వెలుగులు, వైద్య సిబ్బంది, గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

15వ ఆర్థిక సంఘం
నిధుల స్వాహా గుట్టు రట్టు

ప్రభుత్వ అధికారులే సూత్రదారులు

అధికారులకు షోకాజ్ నోటీసులు

కొనసాగుతూ..న్న విచారణ

ఎంపిడిఒ కార్యాలయం

కంచెను చేనే మేసినట్టుగా ఉంది కొంతమంది అధికారుల తీరు. వారే స్వయంగా అక్రమాలకు తెర లేపారు. పల్లె ప్రగతి కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులను పక్కదారి మళ్లించి జేబులో నింపుకున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పనులు చేయకుండా చేసినట్టు నకిలీ బిల్లులు సృష్టించి ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. ఈ వ్యవహారాన్ని గుర్తించిన కొందరు ప్రజానేతలు ఆ అక్రమ అధికారుల గుట్టును రట్టు చేసి జిల్లా ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లారు. రోజులు గడుస్తున్నా స్వాహా అధికారులపై ఎలాంటి విచారణ చేయకుండా నోటీసులకే పరిమితం చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి-లింగాల

లింగాల మండలం ఎంపిడిఒ కార్యాలయంలో ఈ అక్రమ వ్యవహారం భాగోతం బయటపడింది. పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం పరిధిలోని 19 గ్రామ పంచాయతీల్లో కనీస వసతులు, వాటి నిర్వహణ కోసం ప్రభుత్వం 2023- 24 మధ్యకాలంలో 15వ ఆర్థిక ప్రణాళిక కింద రూ.77 లక్షల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ రకమైన నిధులతో ప్రజానీకానికి అభివృద్ధి ఫలాలు అందించాల్సి ఉంది. అప్పటి ఎంపిడిఒ, జూనియర్ అసిస్టెంట్, ప్రస్తుత ఎఒ సంయుక్తంగా పక్కదారి పట్టించి స్వాహా చేశారు. ఆ సమయంలో ఎన్నికల కోడ్ అమలు కావడంతో ఇదే అదునుగా భావించి ఆ ముగ్గురు అధికారులు రూ.77,34,168లక్షల నిధులను సమభాగాలు చేసుకొని జేబులు నింపుకున్నారు. ఆ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం కేటాయించిన నిధులన్నీ పూర్తిగా ఆ ముగ్గురు అక్రమార్కులు దోచుకోవడంతో పల్లె ప్రగతి కుంటుపడింది. ఫలితంగా క్షేత్రస్థాయిలో ప్రజలు కనీస అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. పల్లెల్లో తిష్ట వేసిన సమస్యలతో గ్రామీణులు పడే ఆవేదనను గుర్తించి పాలకవర్గం ప్రభుత్వం 2023 నుంచి 2024 లో మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులపై విచారణ చేశారు. ఈ నేపథ్యంలో ఆ నిధులు ఎంపిడిఒ కార్యాలయంలోని ముగ్గురు అధికారులు పక్కదారి మళ్లించి దోపిడీ చేశారనే విషయాన్ని గుర్తించి, వారి గుట్టును బట్టబయలు చేశారు. ఆ ముగ్గురు అక్రమ అధికారులపై కలెక్టర్ సిఇఒకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిఇఒ ఆ ముగ్గురు అక్రమార్కులకు ఈనెల 26న షోకాజ్ నోటీసులను జారీ చేశారు. షోకాజ్‌లో నోటీసులకే పరిమితం చేశారే తప్ప పక్కదారి మళ్లిన నిధుల వ్యవహారంపై విచారణ సాగలేదని విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఈనెల 26న మండల సర్వసభ్య సమావేశంలో పాలకవర్గం తీవ్రస్థాయిలో గళం ఇప్పారు.


Rc.No.E2/4444/2025

O/o ZPP, Kadapa, Dated:26.08.2025.

SHOW -CAUSE NOTICE

Sub: - Establishment - YSR Kadapa District - Enquiry- Oral complaint made by the MPDO, MPP, Lingala regarding misappropriation of 15th Finance Commission funds of MPP, Lingala - Inquiry report received - Certain staff involved in the misappropriation - SHOW CAUSE NOTICE - ISSUED - Regarding.

Ref: - 1.Lr.NO.E2/3521/2025 of the CEO, ZPP, YSR Kadapa District.
2. Lr NO.DLDO/SPL/IO/2025, Dt: 07.08.2025 of the DLDO, Pulivendula along with Inquiry report.

&&&

Whereas, the MPDO, MPP, Lingala has made oral complaint regarding misappropriation of 15th Finance Commission funds of MPP, Lingala. Accordingly, the DLDO, Pulivendula was appointed as Inquiry Officer to inquire into the allegations, vide reference 1st cited.

In the reference 2nd cited, the DLDO, Pulivendula/Inquiry Officer has submitted the inquiry report. Wherein, it is reported that, an amount of Rs.66,94,167/- is misappropriated. The following persons are involved in the mis appropriation as per the report.

S.No	Name & Designation of the employee (Sarva Sree)
1	K.Surendranath, the then MPDO (FAC), Lingala now working at MPP, Pendlimarri.
2	V.Lokeswara Rao, the then MPDO (FAC), Lingala now Administrative Officer, MPP, Lingala
3	Y.Sreekanth, Junior Assistant, the worked at MPP, Lingala now working at MPP, Pulivendula

The Inquiry report conclusion is as follows:

In view of all the series of above adversities in drawing of amount, the following amount has been misappropriated by the individuals as shown against them:

అధికారులకు జారీ చేసిన నోటీసు

కొల్లగొట్టింది ఇలా..

పల్లె ప్రగతి కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులను ప్రభుత్వం నిబంధన ప్రకారంఖర్చు చేయలేదు. ఇందుకు విభిన్నంగా ఆ ముగ్గురు అక్రమ అధికారులు తెర లేపి ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. నిధులు మంజూరైన వెంటనే గుత్తేదారులని పిలిపించి వారికి వెండర్ కోడ్, పాన్ కార్డు నమోదు చేయాలి. అభివృద్ధి పనులను సిఎఫ్ఎంఎస్, పిఎఫ్ఎంఎస్ ఆన్ లైన్‌లో నమోదు చేయాలి. ఎంబుక్ నమోదు చేసి గుత్తేదారులకు చెక్కులను అందించి బిల్లులు మంజూరు చేయాల్సి ఉంది. కానీ వీటికి భిన్నంగా ఫేక్ వెండర్ కోడ్ క్రియేట్ చేసి 6 ఎంబుక్‌లను ట్యాంపరింగ్ చేశారు. పులివెందులలోని యునియన్ బ్యాంకులో 045212010000776 అకౌంట్‌లో ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నగదును జమచేసింది. మండల ఆభివృద్ధి కోసం మండల అభివృద్ధి అధికారి పేరు మీద పులివెందులలోని ఎస్‌బిఐ మేయిన్ బ్రాంచ్‌లోని 30669548873 అంకౌంట్‌కు నగను మళ్లించి 6 చెక్కులను నగదు రూపంలో డ్రా చేసుకున్నారు.

నగదు డ్రా చేసుకున్న వివరాలు ..

విడతల వారిగా 6 చెక్కులకు కలిపి రూ. 45,54,595 తొలిత డ్రా చేసుకున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.11 లక్షల డ్రా చేశారు. కొద్ది రోజుల వ్యవధిలో రూ.9.2 లక్షలు డ్రా చేసుకున్నారు. ఇంకా రూ.9,45,405 లెక్కల సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విచారణ అధికారిగా డిఎల్‌డిఒ..

నిధుల స్వాహాపై అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతధికారులు డిఎల్‌డిఒను విచారణ అధికారిగా నియమించారు. ఈ ఏడాది జులై 11న అప్పటి ఎంపిడిఒ సురేంద్రనాథ్, ప్రస్తుత ఆడ్మిస్టేటివ్ ఆధికారి లోకేష్‌ను లింగాల మండల పరిషత్తు కార్యాలయంలో ఆమె విచారించారు. అదే నెల 14 రెండవ సారి వారిని విచారించారు. అప్పటి నుంచి నగదుకు సంబంధించి విచారణ ముందుకు సాగడం లేదు. ఇనెల 26న జడ్‌పి సిఇఒ ఓబుళమ్మ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజులలో ముగ్గురు అధికారులు తన ముందు హజరై వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


15th Finance Commission Funds MPP Lingala

S.No	Date	Cheque No	Amount	Drawing Officer	Drawing Person	Remarks
1	18.12.2023	57669220	723078	K.Surendranath 9573308423	Y.Sreekanth 9701526554	Recoveries 11.00 lakhs. 6 M Books tampered (19.00 Lakhs) Deposit 10.00 Lakhs
2	01.01.2024	57669279	615212			
3	20.01.2024	72003761	815232			
4	28.02.2024	72003762	1004016			
5	04.12.2024	72003763	863000	V.Lokeswara Rao FAC MPDO (09.08.24 to 03.10.24) 8688350613		
6	17.05.2025	72003764	534057			
	Total		4554595			

నగదు డ్రా చేసిన వివరాలు

డిఎస్‌సి సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

ప్రజాశక్తి-కడప అర్బన్

మెగా డిఎస్‌సి-2025 సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. కడప నగరంలోని ఎస్.వి.ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ అధ్యక్షతన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ఒక్కో టీముకు 50 మంది చొప్పున 17 టీంలను ఏర్పాటు చేశారు. 30 మంది వాలంటీర్లు కూడా అందుబాటులో ఉండేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రధానంగా వెరిఫికేషన్‌కు సంబంధించి విద్యా శాఖ, రెవెన్యూ అధికారులు, దాదాపుగా 68 మందితో 17 టీములతో పాటు 30 మంది వాలంటీర్లు అందుబాటులో ఉండి పరిశీలన కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. హారిజంటల్ వర్టికల్ రిజర్వేషన్ల ఆధారంగా అభ్యర్థి లాగిన్‌లోనే ఆర్డర్ కాపీలు జనరేట్ అయ్యాయి. ఆధార్ కాపీలు జనరేట్ అయినవారు మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరై తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకున్నారు. చివర ర్యాంకులో ఉన్నవారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో ఎవరైనా విఫలమైతే అవకాశం రావచ్చని ఉపాధ్యాయవర్గాల సమాచారం. వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మెగా డిఎస్‌సి రాష్ట్ర అబ్జర్వర్ మధుసూధనరావు పరిశీలించారు.

ముందే వచ్చిన దసరా పండుగ : ఎమ్మెల్యే

జిల్లాలో దసరా పండుగ ముందే వచ్చిందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం డిఎస్‌సి అభ్యర్థుల ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టారన్నారు. అభ్యర్థులు ఎటువంటి ఆందోళనకు గురికావలసిన అవసరం లేదని తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చిన ప్రకారంగా ఉద్యోగాలు భర్తీ చేస్తారన్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేస్తున్నట్లు చెప్పారు.

ఆర్‌టిసి అభివృద్ధే లక్ష్యం

- ఆర్‌టిసి జోనల్ చైర్మన్ పూల నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆర్‌టిసి అభివృద్ధే లక్ష్యమని ఎపిఎస్‌ఆర్‌టిసి జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. గురువారం ఎపిఎస్‌ఆర్‌టిసి కడప జోనల్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం ఆర్థికంగా లాభదాయకమని తెలిపారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా అమలు చేసిన స్త్రీశక్తి పథకం సూపర్ హిట్ అయిందని తెలిపారు. ఈ పథకం అమలుకు సహకరించిన ఆర్‌టిసి అధికారులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేవారు. భవిష్యత్తులో ఆర్‌టిసి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి గోపాల్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ గజలక్ష్మి, డిప్యూటీ సిఇఒ పి.వి.రమణారెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ధనలక్ష్మి, ఇన్‌ఛార్జి విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ధర్మతేజ, సెక్యూరిటీ ఎస్ఐ సలాం, డిప్యూటి సిటిఎం ప్రశాంతి, డిపో మేనేజరు డిల్లేస్వరరావు, అధికారులు, ఆఫీస్ సిబ్బంది, అన్ని యూనియన్ల అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పూల నాగరాజు

బ్రౌన్‌కు ప్రాణంపోసిన 'మైనంపాటి'

ప్రజాశక్తి కడప అర్బన్ : తెలుగు సూర్యుడు సి.పి.బ్రౌన్‌కు తన చిత్రలేఖన నైపుణ్యంతో రూపమిచ్చి ప్రాణంపోసిన మేటి చిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం అని యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గురువారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో సి.పి.బ్రౌన్ ఊహా చిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్ర హ్మణ్యం 103వ జయంతిని నిర్వహించింది. ముందుగా ఆచార్య టి.శ్రీనివాస్, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలిసి మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం చిత్ర పటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఆ తర్వాత ఆచార్య టి.శ్రీనివాస్ మాట్లాడుతూ సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయం వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 1990లో కడప ఆకాశవాణి కేంద్రంలో కలిసి మిత్రులైన మైనంపాటితో బ్రౌన్ స్మారక భవనాన్ని నిర్మించుకుంటున్నాం కానీ ఆ మహానుభావుని చిత్రానికి నోచుకోలేకపోయామని పేర్కొన్నారు. ఇంకా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి. పార్వతి, సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, సహాయ పరిశో ధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది జి.హరిభూషణరావు, ఎన్.రమేష్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్. వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

డిసిఇబి హాల్ నిర్మాణానికి చొరవ

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలోని పదివేల మంది ఉపాధ్యాయులకు సంబంధించిన జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ కార్యాలయ నిర్మాణానికి సహకరించాలని కడప జిల్లా ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్‌రెడ్డి కోరారు. గురువారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. 1997 నుంచి అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ తులసి రెడ్డి నిర్మించారని చెప్పారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహణ కూడా గతంలో జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ హాల్ అందుబాటులో ఉండేదని పేర్కొన్నారు. ప్రస్తుతం డిసిఇబి హాల్ లేక ఉపాధ్యాయులకు, విద్యాశాఖ మండల, జిల్లా అధికారులకు చాలా ఇబ్బందిగా ఉందని చెప్పారు.

బుగ్గవంక రహదారులకు
మోక్షమెప్పుడో?

- 5.9 కి.మీ రహదారి నిర్మాణం పెండింగ్
- బిల్లు ఆలస్యం పేరుతో కదలని కాంట్రాక్టర్
- రూ.10 కోట్ల రహదారి పనులకు గ్రహణం
- కలెక్టర్ కన్నెర్రతో ఒత్తిడిలో ఇంజినీర్లు

బుగ్గవంక రహదారి పనులకు మోక్షమెప్పుడో తెలియడం లేదు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో బుగ్గవంక రహదారి పనుల్ని పూర్తి చేయాల్సి ఉంది. స్థానికుల నుంచి బుగ్గవంక రహదారి పనుల్ని పూర్తి చేయాలనే ఒత్తిడి పెరిగింది. కలెక్టర్ బుగ్గవంక రహదారి పనులపై దృష్టి సారించారు. ఇరిగేషన్ ఇంజినీర్లను పిలిచి పనుల ఆలస్యానికి గల కారణాలను ఆరా తీశారు. బిల్లు చెల్లింపుల ప్రక్రియ ఆలస్యం కావడంతో కాంట్రాక్టు సంస్థ పనుల్ని అటెక్కించడం ఆందోళన కలిగిస్తోంది. బిల్లుల చెల్లింపుల ఆలస్యం పేరుతో నిలుపుదల చేయడం సరికాదని కలెక్టర్ కనెర్ర చేసినట్లు తెలుస్తోంది. ఇరిగేషన్ ఇంజినీర్లు, కాంట్రాక్టు సంస్థ అయోమయంలో పడినట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బుగ్గవంక రహదారి నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. జిల్లా అధికార యంత్రాంగం, రాజకీయ నాయకత్వ నిర్లక్ష్యం కారణంగానే ఏళ్ల తరబడి సా...గుతూనే ఉందనే వాదన వినిపిస్తోంది. కడప పట్టణం మధ్యలో బుగ్గవంక 12 కిలోమీటర్ల మేరకు ప్రవహిస్తోంది. 2008లో వైఎస్ఆర్ సర్కారు రూ.63 కోట్లతో బుగ్గవంక సుందరీకరణ పనులు చేపట్టింది. 2010 జూన్‌లో రూ.14.2 కోట్లతో ఓ కాంట్రాక్టు సంస్థకు టెండర్ అప్పగిం చింది. 10 నెలల్లో పూర్తి చేయాలని గడువును సైతం నిర్దేశించింది. 2011 మార్చిలో భూసేకరణ నివేదికను జిల్లా అధికార యంత్రాంగం అందజేసింది. అప్పటి నుంచి బుగ్గవంక రహదారి పనుల్ని మూలన పడేశారు. 2021, 2022 నవంబర్ మాసాల్లో బుగ్గవంక వరద లోతట్టు ప్రాంతాలను ముంచెత్తిన సంగతి తెలిసిందే. పాలకుల్లో కదలిక వచ్చింది. అనంతరం భూసేకరణ, ఆక్రమణ తొలగింపు ప్రక్రియలను పూర్తి చేసింది. వైసిపి సర్కారు రూ.10 కోట్లు విడుదల చేసింది. జిల్లా నీటిపారుదలశాఖ టెండరు పిలిచింది. హైదరాబాద్‌కు చెందిన వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ సంస్థ కాంట్రాక్టును దక్కించుకుంది. కాంట్రాక్టు సంస్థ బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన అధికార పార్టీకి చెందిన నాయకునికి సబ్‌కాంట్రాక్టు ఇచ్చింది. రూ.కోటి విలువ కలిగిన పనులు పూర్తి చేసింది. బిల్లు చెల్లింపుల ప్రక్రియ మందగించడంతో రహదారి పనుల్ని సబ్ కాంట్రాక్టర్ అటకె క్కించడం ఆందోళన కలిగిస్తోంది. కడప నగరంలో వాహన రద్దీ పెరగడం, వర్షా కాలం నేపథ్యంలో రహదారి పనుల్ని పూర్తి చేయాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది.

అసంపూర్తిగా నిలిచిన బుగ్గవంక రోడ్డు పనులు

కలెక్టర్ ఆగ్రహం...ఇంజినీర్లలో అయోమయం

బుగ్గవంక రహదారి పెండింగ్ పనులపై కలెక్టర్ కన్నెర చేశారు. బుగ్గవంకకు ఇరువైపులా 12 కి.మీ రహదారి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టు సంస్థ 6.1 కి.మీ మేర నిర్మాణ పనులు పూర్తి చేసింది. మిగిలిన 5.9 కి.మీ రహదారి పనులు బిల్లుల చెల్లింపుల ప్రక్రియ ఆగి పోయిందనే పేరుతో నిలిపేసింది. ఒకవైపు కలెక్టర్ బుగ్గవంక రహదారి పనుల్ని పూర్తి చేయాలనే ఆదేశాలు, మరోవైపు కాంట్రాక్టు సంస్థ మొరాయింపు నేపథ్యంలో ఇరిగేషన్ ఇంజినీరింగ్ యంత్రాంగం సతమతమవుతోంది. కాంట్రాక్టు సంస్థ యాజ మాన్యం హైదరాబాద్‌కు చెందినది కావడం, సబ్‌కాంట్రాక్టర్ అధికార పార్టీకి చెందిన నాయకుడు కావడంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. కడప ఎమ్మెల్యే, టిడిపి జిల్లా కీలక నాయకత్వం నిర్లక్ష్యం కారణంగానే పనులు పెండింగ్‌లో పడ్డాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విద్యుత్ భారాలు తగ్గంచకపోతే
మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదు

- ఆందోళనలో వామపక్ష నేతల హెచ్చరిక

కడప అంబేద్కర్ సర్కిల్ వద్ద వామపక్షాల ఆందోళన

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ ఛార్జీలు తగ్గించి స్మార్ట్ మీటర్ల బిగింపును రద్దు చేసే వరకూ పోరాటం ఆగదని వామపక్ష నాయకులు ప్రశ్నించారు. గురువారం అంబేద్కర్ కూడలి వద్ద ప్రతిజ్ఞ, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి బందెల ఓబయ్య, రమణయ్య మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ 2000 సంవత్సరం ఆగస్టు 28న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వామపక్షాలు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో శాంతియుతంగా ర్యాలీ జరుగుతుండగా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విచక్షణారహితంగా కాల్పులు జరిపి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డిని పొట్టన పెట్టుకుందన్నారు. అనేకమంది వామపక్ష నాయకులు, కార్యకర్తలు పోలీసు లాఠీలకు, గుర్రాల దాడులకు, తుపాకీ దెబ్బలకు గాయాల పాలయ్యారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా సంస్కరణలు యథావిధిగా అమలు చేసిందన్నారు. మనిషికి నిత్యం అవసరమైన విద్యుత్ రంగాన్ని మరింత పటిష్టపరిచి, తక్కువ ధరలో ఉత్పత్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ భారాల ప్రభావం ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజల జీవనాన్ని అతలాకుతలం చేస్తుందని పేర్కొన్నారు. అర్ధ జీవిత కాలంగా ఆందోళన సాగిస్తున్న పాలక ప్రభుత్వాలకు ఎన్నికల్లో మాత్రమే ఒక ప్రధాన అస్త్రంగా వాడుకుని అధికారంలోకి రాగానే వాగ్దానాలకు తిలోదకాలు ఇచ్చి ప్రజలపై ఎడాపెడా ఛార్జీల మోత మోగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాదుడే బాదుడు అనే పోరాటానికి నాయకత్వం వహించి అధికారంలోకి రాగానే మోదుడే మోదుడు అన్న చందంగా ట్రూ ఆఫ్, సర్, సర్దుబాటు ఛార్జీలు పేరుతో వినియోగం గోరంత, విద్యుత్ బిల్లు కొండంత అన్న చందంగా విద్యుత్ ఛార్జీలు పెంచడమే కాకుండా విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ బాధ్యతలు నుంచి పూర్తిగా తప్పుకుందన్నారు. అంబానీ, ఆదాని, షిరిడి సాయి లాంటి సంస్థలకు అధిక ధరకు ఒప్పందాలు చేసుకుని వాటి భారాన్ని కూడా ప్రజలపై రుద్దేందుకు సిద్ధం చేశారన్నారు. ఉన్న మీటర్లు పక్కనపెట్టి స్మార్ట్ మీటర్ల పేరుతో స్మార్ట్ దోపిడీకి శ్రీకారం చుట్టారని వాపోయారు. విద్యుత్ ఛార్జీల పెంపు ప్రభావం ప్రజలపై తీవ్రంగా ఉందని, ప్రజలెవరు పెంచిన విద్యుత్ ఛార్జీలు కట్టరాదని, స్మార్ట్ మీటర్లు పగలగొట్టమనీ పిలుపునిచ్చిన చంద్రబాబు, లోకేష్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో వేల కోట్ల రూపాయలు అదనపు ఛార్జీల పేరుతో గత ప్రభుత్వంలో చేపట్టిన సంస్కరణలు యథావిధిగా అమలు చేస్తూ ప్రజలను పట్టిపీడిస్తోందన్నారు. గడచిన 11 సంవత్సరాల మోడీ పాలనలో ప్రజల రక్త మాంసాలతో నిర్మితమైన ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని వాపోయారు. ప్రజలకు పెనుబారంగా మారిన విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేసే వరకూ బషీర్‌బాగ్ కాల్పులలో అమరవీరుల స్ఫూర్తితో మరో బషీర్ బాగ్ లాంటి పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, ఎల్.నాగ సుబ్బారెడ్డి, కె.సి.బాదుల్లా, దస్తగిరి రెడ్డి, జి.మద్దిలేటి, శంకర్ నాయక్, శ్రీనివాసులు రెడ్డి, అన్వేష్, కె.మునయ్య, జకరయ్య, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

బద్వేలు : విద్యుత్ భారాలు తగ్గించకపోతే మరో బషీర్బాగ్ ఉద్యమం తప్పదని వామపాక్ష పార్టీలు పేర్కొన్నాయి. విద్యుత్ ఛార్జీల వ్యతిరేక పోరాటంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరుల 25వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తూ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి. వీరశేఖర్, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు యం.చిన్ని, సిపిఐ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు ఎస్. చంద్రశేఖర్, సిపిఐ పట్టణ కార్యదర్శి పి. బాలు, పట్టణ నాయకులు నాగరాజు, పి.వి. రమణ,పి. వెంకటరమణ, ఎస్.నాగేశం, ప్రభాకర్, విజయమ్మ సిపిఐ (ఎం) పట్టణ కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ కైరున్ బీ, సగిలి రాయప్ప, పసుపుల మోక్షమ్మ, చెప్పాలి సుబ్బరాయుడు,బాబు, నాయకులు ఆదిల్, ఫాతిమా, బాలస్వామి సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పట్టణ నాయకులు అనిల్, బాబు, రామరాజు, నారాయణ, జయపాల్, చంద్రపాల్ పాల్గొన్నారు.

పొద్దుటూరు : ఇళ్లకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. స్థానిక పాత బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం విద్యుత్ అమరవీరులకు ప్రతిజ్ఞ చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పకీరయ్య, చెన్నారెడ్డి, నారాయణ, సిఐటియు కార్యదర్శి విజయ్ కుమార్, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, రవితేజ, చార్లెస్, శీను, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, గోపాల్ ప్రయివేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ నాయకులు రాజు మహిళా సంఘం అధ్యక్షులు సర్వేశ్వరి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు

విద్యుత్తు ప్రమాదాల పట్ల జాగ్రత్తలు అవసరం : ఎస్ఇ

ప్రజాశక్తి - కడప

వినాయక మండపాల వద్ద విద్యుత్తుతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. వర్షాలకు అతుకులు పడ్డ వైర్లు మరింత ప్రమాదకరమని, లైటింగ్ అలంకరణల నిర్మాణాల వద్ద మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించారు. గురువారం తన ఛాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. భారీ, ఎత్తైన విగ్రహాల ఊరేగింపు సమాచారం విద్యుత్ అధికారులకు అందించాలని తెలిపారు. నిర్వాహకులు విద్యుత్ పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రానున్న రోజుల్లో వర్షాలు ఉన్నాయన్న నేపథ్యంలో విద్యుత్ మండపాల వద్ద లైటింగ్ అలంకరణ నిర్మాణాలకు, సౌండ్ సిస్టంకు, విద్యుత్ ఉపకరణాలకు ఉపయోగించే వైర్లు నాణ్యమైనవిగా ఉండాలి అన్నారు. వర్షాలకి భూమిపై తేమ ఉండడం వల్ల చిన్నపాటి అతుకులు ద్వారా పెద్ద ప్రమాదాలు సంభవిస్తాయని నాణ్యమైన వైర్లు మరియు, విద్యుత్ ఉపకరణాలు ఉపయోగించాలని చెప్పారు. నిర్వాహకులు ప్రణాళిక బద్ధంగా కీలకంగా వ్యవహరించి విద్యుత్ పట్ల తగు జాగ్రత్తలు తీసుకుని పండగను సంతోషాల మధ్య గడపాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సుడిగుండంలో భారత్

ప్రజాశక్తి - కడప

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అసమర్థ పాలన వల్ల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రూ. 5.25 లక్షల కోట్ల అదనపు సుంకాలను విధించారని, దీంతో ఆర్థిక సుడిగుండంలో భారతదేశం చిక్కుఉందని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ విమర్శించారు. కడపలోని తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు గత కొంత కాలం నుంచి అదనపు సుంకం విధిస్తానని బెదిరిస్తున్నప్పటికీ ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ఇప్పుడు అమెరికా దేశానికి భారతదేశం నుండి ఎగుమతి చేసే వస్తువులపై ఏకంగా 50 శాతం మేర అదనపు సుంకాలను వడ్డించారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యవసానంగా దేశంలోని భారీ పరిశ్రమలపై ఇది ప్రత్యక్ష దుష్పలితాలకు కారణమవుతుందన్నారు. ఇప్పటికే దేశంలో నిరుద్యోగం, దారిద్ర్యం,పేదరికం తాండవిస్తోందన్నారు. 11 ఏళ్లుగా మోడీ కేవలం మత విద్వేష పరిపాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఓట్ల దొంగతనంతో గద్దెనెక్కిన మోడీ దేశాన్ని ఆర్థికంగా దివాలా తీయించారని ఆరోపించారు.

జమ్మలమడుగులో కేక్ కట్ చేస్తున్న వల్లంబాయి హృషీకేశవరెడ్డి

ఘనంగా అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కడప పార్లమెంట్ సభ్యుడు వై.ఎస్.అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైసిపి జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వల్లంబాయి హృషీకేశవరెడ్డి బుధవారం నిర్వహించారు. భారీ కేక్ కట్‌చేసి అభిమానులు, కార్యకర్తలు పంచారు. అనంతరం వెయ్యి మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గజ్జల లక్షుమయ్య, దోడియం విష్ణువర్ధన్‌రెడ్డి, గౌతమబోయిన గురు మూర్తి యాదవ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. **ఖాజీపేట :** అవినాష్‌రెడ్డి జన్మదిన కార్యక్రమాన్ని ఆయన అభిమానులు పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించుకున్నారు. వృద్ధాశ్రమాలలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంచారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మండలంలోని త్రిపురవరం గ్రామంలో వైసిపి నాయకులు వినోద్ కుమార్ రెడ్డి , జిల్లా జనరల్ సెక్రెటరీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 40 కిలోల కేకును కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కొత్తపల్లి నాగిరెడ్డి, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం కృష్ణారెడ్డి, వేమారెడ్డి, మాజీ సర్పంచ్ మీగడ కృష్ణారెడ్డి, కున వారిపల్లి సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి, అంబటి శివారెడ్డి పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** అవినాష్‌రెడ్డి 42వ జన్మదిన వేడుకలను పులివెందులలో నాయకులు ఘనంగా నిర్వహించారు. వైసిపి కార్యాలయంలో కౌన్సిలర్ కోడి రమణ, వైసిపి మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్ రెడ్డి కలిసి కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అలాగే అన్నదానం, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లపు వరప్రసాద్, ఎంపిపి ఎ.రాఘవరెడ్డి, హాల్ గంగాధర్ రెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కంచర్ల సర్వోత్తమ్ రెడ్డి, నారాయణస్వామి, యర్ర వెంకటసుబ్బయ్య, బ్యాటరీ ప్రసాద్, రవి శంకర్ రాయల్, తొండూరు మండలం రమేష్, రవి శంకర్ రెడ్డి, వెలమారిపల్లి భాస్కర్ రెడ్డి, ఓతుర్ వసూల్, నూరుల్లా, కోళ్ల భాస్కర్, దాసరి చంద్రమౌళి, జశ్వంత్ రెడ్డి, ఖాదర్బాషా, ఎత్తున వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు హద్దులు చూపించాలి

ప్రజాశక్తి - వేంపల్లె : వేంపల్లెలోని శ్రీవృషభాచలేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములకు హద్దులు చూపించాలని దేవస్థానం పాలక మండలి సిబ్బంది కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహశీల్దార్ హరినాథ్‌రెడ్డినికలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీవృషభాచలేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి అలిరెడ్డిపల్లె గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ – 1లో 123.33 సెంట్లు, సర్వే నెంబర్ 3లో 22 సెంట్లు భూమి కొండ ప్రాంతంలో ఉందని చెప్పారు. ఆలయానికి సంబంధించి సత్రాలు కూడా ఉన్నాయన్నారు. ఎద్దుల కొండ ప్రాంతంలో ఆలయ భూమి ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు సర్వే చేయించి హద్దులు చూపించాలని కోరారు. హద్దులు వేసేందుకు మండల సర్వేయర్‌కు సూచనలు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో తాత్కాలిక పాలక మండలి సభ్యులు పివి రమణ, అర్చకులు ప్రవీణ్ గాలి హరిప్రసాద్‌తో పాటు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఇ నూతన బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప

ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిఎం

నగరంలోని ఏ రోడ్ల కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కడప ఎంఎస్ ఎంఇ – సులబ్ నూతన బ్రాంచ్ గురువారం జనరల్ మేనేజర్ ఐ.పాండురంగ మితాం తయ్యి, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్. కె. అగర్వాల్ ప్రారంభించారు. నూతన బ్రాంచ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ తమ బ్యాంక్ చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమలకు అనువైన వివిధ రకాల రుణ పథకాలను అందుబాటులోకి తెచ్చింది అన్నారు. సద్వినియోగం చేసుకొని, అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ప్రాంతీయ అధికారి అరుణజ్యోతి ఆధ్వర్యంలో, కస్టమర్ల సహకారంతో అభివృద్ధి చెందుతున్న తమ కడప రీజనల్ ఆఫీస్ మరో ముందడుగు వేస్తూ ఎంఎస్‌ఎంఇ సులబ్ శాఖను ప్రారంభిస్తోంది అని తెలిపారు. కార్యక్రమంలో డిఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి పార్టీలో చేరిక

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

వెంకటేశ్వర్‌రెడ్డిని టిడిపిలోకి ఆహ్వానిస్తున్న బిటెక్‌రవి

. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నచ్చే పార్టీలో చేరుతున్నారని టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. రాఘవేంద్ర థియేటర్ సమీపంలో ఉన్న వెంకటేశ్వర్ రెడ్డి తమ కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి గురువారం టిడిపి పార్టీలో చేరారు. బి టెక్ రవి వారిన్ని పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వంలో తాము కూడా భాగస్వామ్యం అయ్యి తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుంటామని వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయలు పార్థసారధిరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా ఉమైర్

ప్రజాశక్తి - కడప అర్బన్

వై.ఎస్.జగన్‌తో ఉమైర్

వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కడప నియోజకవర్గానికి చెందిన షేక్. ఉమైర్ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యా లయం తాడేపల్లి నుంచి ఉత్తర జారీ చేశారు. పార్టీ ఆదేశాల మేరకు భవిష్యత్తులో నడుచుకుంటానని ఉమైర్ తెలిపారు.

వినాయక వేడుకల్లో అపశృతి

- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగరంలోని బాలాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో అపశృతి చోటు చేసుకుంది. విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వినాయక మండపంలో విద్యుత్ తగలడంతో రాజారెడ్డి వీధికి చెందిన చెప్పలి సుమ తేజ (పండు) అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్న తాలూకా పోలీసులు పేర్కొన్నారు.

తెలుగు మీడియం విద్యార్థులకే ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - చాపాడు : రాష్ట్రంలోని తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు మాత్రమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రచయిత బొమ్మిశెట్టి రమేష్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ న్యాయ తీర్పులలోను, ప్రభుత్వ కార్యాలయాల జీవోలను తెలుగులో మాత్రమే ఇవ్వాలన్నారు. గిడుగు వెంకట రామమూర్తి తెలుగు భాషను గ్రాంథిక భాష నుంచి వాడుక భాషలోకి మార్చడంలో కీలక పాత్ర వహించారన్నారు. గిడుగు జయంతిని ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు.

పిల్లలను ఉన్నత స్థానాలకు చేర్చాలి

ప్రజాశక్తి - కడప : పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థానాలకు చేర్చాలి అని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు ప్రవీణ్ కుమార్, రవితేజ అన్నారు. 'గిరిజన ప్రజలలో బాల్య వివాహాలు – చిన్న వయసులోనే గర్భధారణ' తదితర అంశాలపై కడప నగరం దండు గిరిజనుల కాలనీ లో గురువారం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్సా పథకం 2015, అట్టడుగు బలహీన ఆదివాసుల చట్టాలు, బాల్యవివాహాలను నిర్మూలించడానికి ప్రామాణిక ఆపరేటింగ్ విధానం 2025 గురించి వివరించారు.

పరిశోధన ప్రయోజనాలు తెలుసుకోవాలి

- అంతర్జాతీయ సదస్సులో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్

సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి - కడప

జీవశాస్త్రంలో చోటు చేసుకుంటున్న ప్రస్తుత పరిశోధనలు, వాటి వల్ల సమాజంలో కలిగే ప్రయోజనాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. గురువారం ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి) జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సమగ్ర జీవశాస్త్రం, ఔషధశాస్త్రంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలు చేసి వాటి ఫలాలు పొందాలన్నారు. ఎపి అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ తులసి మాట్లాడుతూ జీవశాస్త్ర పరిశోధనల వల్ల మానవుల్లో వచ్చేటువంటి వ్యాధులను త్వరగా న్యాయం చేయడానికి వీలవుతుందని తెలిపారు. డాక్టర్ రాజేష్ కుమార్ ఇ వ్యర్థలా నిర్వహణ గురించి, వాటిని సరిగ్గా నిర్వీర్యం చేయకపోతే కలిగే దుష్ప్రభావాల గురించి తెలియజేశారు. డాక్టర్ భూపేష్ ప్రస్తుత కాలంలో ఆధునిక జీవశాస్త్రం అభివృద్ధి చెందుతున్నప్పటికీ దీర్ఘకాలిక వ్యాధులు ఏ విధంగా పెరుగుతున్నాయి, వాటిల్లో అతి ముఖ్యమైన మధుమేహం తగ్గించడానికి ఔషాద మొక్కలు ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ గర్భాశయ కేన్సర్లు రావడానికి గల కారణాలు, వాటి నివారణకు గల చర్యల గురించి వివరించారు. కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ డి. వీర నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ అంతర్జాతీయ సదస్సుకు 200 పైగా పరిశోధక వ్యాసాలను పరిశోదకుల నుంచి స్వీకరించమని తెలిపారు. సదస్సులో కన్వీనర్ డి.వీర నాగేంద్ర కుమార్, డాక్టర్ రమేష్, జువాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్‌ఛార్జి డాక్టర్ పి.రవి శేఖర్, డాక్టర్ నీలయ్య, డాక్టర్ నాగేశ్వరా రెడ్డి, డాక్టర్ మహేష్, డాక్టర్ జమాల్ బాష, డాక్టర్ రామచంద్ర, డాక్టర్ సావిత్రి, పి. మహేష్, పి. నవనీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై 'విజిలెన్స్' దాడులు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పులివెందుల వ్యవసాయ శాఖ ఎడి ప్రభాకర్ రెడ్డి, సిఐ నరసింహులు, వ్యవసాయ శాఖ అధికారి శివశంకర్ రెడ్డితో కలిసి విజిలెన్స్ అధికారులు వేంపల్లెలోని 6 ఎరువుల దుకాణాలపై దాడులు చేసి రికార్డులను తనిఖీ చేశారు. దుకాణాలలో సబ్సిడీ ద్వారా రైతులకు పంపిణీ చేసే ఎరువులు, యూరియా, డిఎపి, ఎంఒపి, కాంప్లెక్స్ ఎరువులకు సంబంధించిన అమ్మకాలు కొనుగోలు వివరాలను దుకాణాదారులతో అడిగి తెలుసుకోవడంతో పాటు వాటి వివరాలను కూడా పరిశీలించారు. ముఖ్యంగా యూరియాకు సంబంధించి స్టాక్ , రైతులకు అమ్మిన వివరాలకు చెందిన స్టాక్ రిజిస్టరు, రసీదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎరువులకు చెందిన గోడౌన్ వివరాలను సేకరించడంతో పాటు గౌడన్లల్లో ఉన్న ఎరువులను తనిఖీ చేశారు. శ్రీకాంత్ ఫర్టిలైజర్స్‌లో దాదాపు రూ. 2 .34 లక్షలు విలువ చేసి వివిధ రకాల ఎరువులను రికార్డు అప్డేట్ చేసుకోకపోవడం వల్ల తాత్కాలికంగా వాటి అమ్మకాలను నిలుపుదల చేసినట్లు పులివెందుల వ్యవసాయ శాఖ ఎడి ప్రభాకర్ రెడ్డి చెప్పారు. దుకాణాదారులు ఎరువులు అధిక ధరలకు విక్రయాలు చేసిన బ్లాక్ మార్కెట్ కు తరలించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేని ఎరువులు అమ్మినా, కల్తీ ఎరువులు విక్రయించిన చర్యలు తప్పవని చెప్పారు. కార్యక్రమంలో దాడుల్లో విజిలెన్స్ డిపార్ట్ మెంట్ హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి శివ శంకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** ఎరువుల దుకాణాలలో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముద్దనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యురియా అధిక రేటులకు విక్రయించిన, యూరియా తోపాటు వేరే మందులు జతపరిచి అమ్మిన చర్యలు తీసుకుంటామన్నారు. యూరియా నిల్వ ఉండి రైతులకు ఇవ్వకపోతే ఆ డీలర్ లైసెన్సు రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో ముద్దనూరు వ్యవసాయ శాఖ టెక్నికల్ ఏవో మధుసూదన్ రెడ్డి, ఏవో కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

వేంపల్లి: రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఇమామ్‌లకు వేతనాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గంలోని ఆయా మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజన్‌లకు వేతనాలు ఇంకా మంజూరు కాలేదని, వారికి వెంటనే ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవిని, ఎంహెచ్ పిఎస్ నాయకులు కోరారు. గురువారం సింహాద్రిపురంలో ఉన్న పులివెందుల జడ్‌పిటిసి మారెడ్డి లతాను, బిటెక్ రవిని వారు టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో కలిశారు. వారిని శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ముస్లిమ్ సోదరులు మాట్లాడుతూ కొన్ని మసీదులకు చెందిన మౌజన్, ఇమామ్‌లకు జీతాలు రాలేదని తెలిపారు. వేంపల్లెలో ఇటీవల నిర్మించిన ఆయేషా మసీదులో ఉన్న ఖాళీ స్థలంలో రెండు గదులు నిర్మిస్తే విద్యార్థులకు విద్య బుద్దులు నేర్పిందుకు అవకాశం ఉంటుందని, గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. దీంతో సిఎం చంద్రబాబు నాయుడు సహకారంతో ఆయెషా మసీదులో గదులు నిర్మించేందుకు కృషి చేయడంతో పాటు పెండింగ్ లో మౌజన్, ఇమామ్ లకు జీతాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డిని కూడ ముస్లిం సోదరులు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గం మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, సభ్యులు కరీముల్లా, దర్బార్ వల్లి, గౌస్, కరీముల్లా, మహమ్మద్ గౌస్, అమీర్ ద్దీన్, బాబా ఫకృద్దీన్ టిడిపి నేతలు మహబూబ్ షరీఫ్, తక్కెల షరీఫ్, గంగాధర్ రెడ్డి, శివలు పాల్గొన్నారు.

ఆప్ నాయకుల ఇళ్లపై దాడులు దుర్మార్గం

ప్రజాశక్తి - వేంపల్లె : ఆప్ నాయకుల ఇళ్లపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడులు చేయడం దుర్మార్గమని ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా కో–ఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు దాదాపీర్ పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరిపాలన చేత కాక ప్రతిపక్షాలపై దాడులు చేస్తున్నారని చెప్పారు. ఢిల్లీలో మాజీ విద్యా శాఖ మంత్రి సౌరబ్ భరద్వాజ్ ఇంట్లో ఇడి, సిబిఐ దాడులు చేయడం దారుణమని వాపోయారు. అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వం పట్ల 10 ఏళ్లుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విషం కక్కుతూనే ఉందన్నారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, అవినీతి రహిత పాలన అందిస్తుండడంతో ఆమ్ ఆద్మీ పార్టీపై బిజెపి ప్రభుత్వం ఓర్చుకోలేక పోయిందని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలోనూ ఫీజులు అధికంగా పెంచడంతో పాటు వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని చెప్పారు.

ట్రిపుల్‌ఐటి అధ్యాపకుడికి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - వేంపల్లె : సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డుకు ఆర్‌జియుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో పని చేస్తున్న కెమిస్ట్రీ విభాగాపతి విరూపాక్షి ప్రభాకర్ ఎంపికయ్యారు. గుంటూరు సదరన్ ప్రయివేటు లెక్చరర్, టీచర్స్ ఆర్గనైజేషన్, కెవిఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డులు ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో పని చేస్తున్న డాక్టర్ విరూపాక్షి ప్రభాకర్ ఎంపికయ్యారు. ఈనెల 31న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అవార్డు అందుకోనున్నారు.

ముద్దనూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

'పత్తి'లో పురుగుల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

పత్తి పంటలో రసం పీల్చే పురుగు ఉధృతి నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని ఒంటిగారిపల్లెలో గురువారం వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ వామి కొండడ్యామ్ కట్ట కింద ఉన్న పంట పొలాలు నీటి తేమ ఎక్కువ వల్ల పంటలు సరిగా మొలకెత్తక, దిగుబడులు రాక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎఒ తెలిపారు. ఎఒ మాట్లాడుతూ రసం పీల్చే పురుగుల నివారణకు ఎకరానికి 10 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేస్తే పురుగు ఉధృతిని నివారించవచ్చన్నారు. అధికారుల సలహాలు సూచనలు పాటించి పంటలు సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ లక్ష్మి సిందూర, రైతులు పాల్గొన్నారు. **వేముల :** మండల కేంద్రంలోని స్థానిక అమ్మయ్యగారిపల్లిలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు ఎఒ జి.పి. ఓబులేసు చామంతి పంటలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ సురేష్, రైతులు పాల్గొన్నారు. **కాశినాయన :** మండల పరిధిలోని చిన్నయపల్లెలో పొలంపిలుస్తోంది వ్యవసాయ విస్తరణ అధికారి రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ అధికారి బి చంద్రమోహన్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఆఖరి వరకు 'పంటల బీమా పథకం'కు సమయం ఉన్నందున ప్రతి రైతూ నమోదు చేసుకుని సర్టిఫికెట్ మీసేవ కేంద్రాల్లో ఇవ్వాల న్నారు. అనంతరం మినుము పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో హర్ష వర్ధన్, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపి వైద్యశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

పట్టణంలోని ఆర్‌ఎంపి వైద్యశాలలను గురువారం అర్బన్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎంపి వైద్యులు ప్రతమ చికిత్సను మాత్రమే చేయాలని సూచించారు. యాంటీబయాటిక్స్ మందులు వాడటం, సెలేను పెట్టడం వంటివి చేయరాదని అన్నారు. నిబంధనలకు మించి వైద్యం చేయరాదని, అలా చేస్తే వైద్యశాలలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆర్‌ఎంపి వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేట సిఐగా వంశీధర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట పోలీస్ స్టేషన్ నూతన సిఐగా ఎస్. వంశీధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నంద్యాల జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ సిఐగా పని చేసిన ఆర్. మోహన్ కడప విఆర్‌కు బదలీ అయ్యారు. . ఈ సందర్భంగా నూతన సిఐ వంశీధర్ మాట్లాడుతూ అసాంఘిక చర్యల కట్టడికి కృషి చేయడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు పాటువడతానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు వివరించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న సిఐ వంశీధర్

మహారాజశ్రీ గౌరవ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, బద్వేల్

O.S.No. 517/2023

భీమచర్ల వీర లక్ష్మి సుమతి, భర్త భీమచర్ల వీర ప్రతాప్ రెడ్డి, వయస్సు 33 సం॥లు, హిందూ, వ్యవసాయం, నివాసం డోర్ నెం. 2/382–ఏ–2–3, వేంపల్లె రోడ్డు, యర్రగుంట్ల టౌన్ & మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా. ...వాది

Vs

1. కొప్పర్తి ఈశ్వర్ రెడ్డి మరియు ముగ్గురు
వేమన వ్యవసాయ క్షేత్రం, రెప్రజెంటెండ్ బై ఇట్స్ మేనేజింగ్ పార్ట్నర్ గౌరు తిరుపతి రెడ్డి, తండ్రి నాగిరెడ్డి, వయస్సు 82 సం॥లు, హిందూ, వ్యాపారం, ఆఫీసు రాధా నగర్, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా.
...ప్రతివాది నెం.4

నోటీసు/సమన్సు

పై నెంబరు గల దావాలో 4వ ప్రదివాది అయిన నీపైన వాది పర్మనెంటు ఇంజక్షన్ సివిల్ దావాను దాఖలు చేసియున్నది. నీకు ఎన్నిమార్లు పై దావాలో సమన్లు, నోటీసులు తీసుకొనడం లేదు. కనుక వాది నీపైన రాజశ్రీ కోర్టు వారిని పేపరు ప్రకటన కోరియున్నది. కావున 01.09.2025 తారీఖున ఉదయం 10:30 గం॥లకు పై తెలిపిన కోర్టు యందు నీవు గానీ, నీ తరపున వకీలు గానీ, హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెయును లేనంతట నీ పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది: 01.09.2025

//కోర్టు ఉత్తర్వుల మేరకు//

జాలా పుల్లయ్య, బి.ఏ., బి.యల్.,
న్యాయవాది,
కడప.సెల్ నెం. 9866873292.

సంస్కృతి, సంప్రదాయాలకు పండుగలు ప్రతీక

వేంపల్లెలో విగ్రహం వద్ద అన్నదానం చేస్తున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపాలు, ప్రతిబింబాలని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా గురువారం వేంపల్లెలో పాతపేటలో, కాలేజీ రోడ్డులో,వడ్డెర వీధిలో ఏర్పాటుచేసిన వినాయక మండపాల్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, వైసిపి నేతలు సుధాకర్, శేషాద్రి, కాంగ్రెస్ పులివెందుల సమన్వయ కర్త ధృవకుమార్‌రెడ్డి ,రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, వెంకటేశు, ఉత్తన్న, వేమయ్య, నాగరాజు, రమణ, రవి పాల్గొన్నారు. **చాపాడు :** మండల పరిధిలోని పలు గ్రామాలలో గురువారం వినాయక నిమజ్జనం సందర్భంగా స్వామివారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిద్ధారెడ్డిపల్లె, మైత్రాయపల్లె, నాగాయపల్లె తదితర గ్రామాలలో స్వామివారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య వినాయక ప్రతిమను గ్రామోత్సవం నిర్వహించి అల్లాడుపల్లె వద్ద కుందూ నదిలో నిమజ్జనం చేశారు. బుధవారం వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సిద్ధారెడ్డిపల్లెలో లడ్డు వేలంపాట నిర్వహించగా రూ. 23వేలు పలికింది. లడ్డును వేలంపాటలో గ్రామానికి చెందిన కామా చెన్నకృష్ణారెడ్డి దక్కించుకున్నారు. సీతారామాపురం, అన్నవరం గ్రామాల వద్ద కుందూ నది వద్ద నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. **పులివెందుల రూరల్ :** పట్టణంలోని స్థానిక జెండా మాన్ వీధిలో మిస్సమ్మ బంగ్లా ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ మండపం దగ్గర గురువారం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ అన్నదానం చేయడం అనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉత్సవ సభ్యులు శ్రీకాంత్, ఖాదర్, వినోదు సాయి, శివారెడ్డి, అన్వర్ పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** వినాయక చవితిని పురస్కరించుకుని అగ్రహారంలో పలు ఆటల పోటీలు గ్రామస్తులు నిర్వహించారు. గురువారం గ్రామానికి చెందిన యువత వాలీబాల్, మహిళల కోసం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గ్రామంలో ఉన్న మహిళలు అందరు కుల మతాలకు అతీతంగా పాల్గొన్నారు. గ్రామంలోని యువత ముందుకు వచ్చి వాలీబాల్‌తో పాటు ఇతర క్రీడలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని పలువురు కొనియాడారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలోని గ్రామంలోని యువత, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. **వేంపల్లె :**వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వేంపల్లెలో రసవత్తరంగా క్రికెట్ పోటీలు గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆట స్థలంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీ చైతన్య పాఠశాల వీధిలో ఉన్న యువత క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన టీమ్‌కు టిడిపి నాయకులు రూ 10 వేలు నగదును, మెమోంటోను అందజేశారు. **వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు తీసుకోవాలి..** వినాయకుడి నిమజ్జన కార్యక్రమంలో మండపాల నిర్వహకులు ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ నర్సింహులు పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని మండపాలను ఆయన పరిశీలించారు. అలాగే మండపాల నిర్వహకులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కడప సిటీ : నగరంలోని విజయ దుర్గ కాలనీలోని 4వ రోడ్డులో వినాయక చవితి సందర్భంగా 23వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయ దుర్గా దేవి ఆలయం వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ హాజరయ్యారు. సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు సంగి నాదం ఆంజనేయులు, గోవిందు నాగరాజు, ఆర్ సుధాకర్, కొండారెడ్డి, పల్లా రాధాకృష్ణ, సిఆర్ఐ సునీల్ జయంత్, రామయ్య చిట్ ఫండ్స్ అధినేత రమేష్, రాజారెడ్డి, సుదర్శన్ రెడ్డి, తిమ్మారెడ్డి సాంబశివరెడ్డి, సుబ్బన్న, గుత్తి వేణు, రఘునాథ్ నాయుడు, విజయదుర్గా కాలనీ వాసుల ప్రజలు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **దువ్వూరు :** ఎటువంటి ఆటంకాలు చోటు చేసుకోకుండా గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను తహశీల్దార్ సంజీవరెడ్డి, దువ్వూరు ఎస్ఐ వినోద్ కుమాం సందర్శించారు మండలంలో నాలుగు చోట్ల నిమజ్జనం ఏర్పాట్ల చేశామని, అధికారులు చెప్పిన చోటే నిమర్జనం చేయాలని సూచించారు. **బ్రహ్మంగారిమఠం :** మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలోని వరుణ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో నెలకొల్పిన వినాయక విగ్రహాన్ని గురువారం ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎలిచెర్ల వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు కలసి నిమజ్జనం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి లడ్డూ ప్రసాదాన్ని సందీప్ అనే ఉపాధ్యాయుడికి అందజేశారు. పురవీధుల గుండా ఊరేగించి బ్రహ్మం సాగర్‌లో బొజ్జ గణపయ్యను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులతో పాటు పాఠశాల కరస్పాండెంట్ ఎలిచెర్ల వెంకటరమణారెడ్డి ప్రధాన ఉపాధ్యాయుడు ప్రణయ్ కుమార్ ఉపాధ్యాయులు రామయ్య, బాలసుబ్బయ్య,ఓబుళపతి , రామచంద్రారెడ్డి, నాగార్జున, సందీప్, వీర కళ్యాణి, సౌజన్య, సుభాషిని, పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కడప విజయదుర్గా కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

చాపాడులో రంగులు చల్లుకుంటూ గ్రామోత్సవం నిర్వహిస్తున్న యువత